# మాటా - మంచీ

– శంకరమంచి పార్ధసారధి

**మనుషులు తీరు, ముఖకవళికలు ఒక్కలాగా వుండనట్లే , మాట్లాడే పద్ధతి కూడా మనిషినించి ఇంకో మనిషి వద్దకెళ్ళేసరికి మారిపోతుంటుంది. కొంతమంది మట్లాడుతుంటే ముక్కున గుద్దినట్లో, రాళ్ళు పెట్టి కొట్టినట్లో వుంటుంది. అదే ఇంకొంత మంది మాట్లాడుతుంటే చిట్టిబాబు వీణకచేరి వింటునట్లనిపిస్తుంది. పరిచయం లేని వ్యక్తితో మొదటిసారిగా మాట్లాడేటప్పుడు, ఆ తీరునిబట్టి ధోరణిని బట్టి అతగాడి గుణగణాలని అంచనా వెయ్యటం జరుగుతుంది. అంటే నోట మాట మనల్ని తూచే కాటా లాంటిదన్నమాట.**

నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుందన్నారు. అంటే మాటల దోరణిని బట్టే శత్రువులూ, మిత్రులూ తయరవుతుంటారు. ‘ ఈ మధ్యన కాస్త వొళ్ళు చేసినట్లున్నారు ’ అనటం వేరు. ఏమిటీ మధ్య దున్నపోతులా బలుస్తున్నావ్ ’ అనడటంవేరు. అలాగే మీ నాన్నగారా అనటానికి ‘ నీయమ్మ మొగుడున్నాడా ’ని అడగడానికి ఎంతో తేడా వుంది. భాషని బట్టి, తీరుని ఎదురుటి వ్యక్తి మనల్ని అంచనా వేస్తాడని తెలుసుకుంటే వుత్తమం.

మాటకి, మంచితనానికి సంబంధం వుండక పోవచ్చు. కొంతమంది తియ్యతియ్యగా మాట్లాడుతూనే గోతులు తీస్తారు. ఇంకొంత మంది కరుగ్గా మాట్లాడినా సమయం వస్తే సహాయం చేస్తారు. కానీ జనం తియ్యదన్నాని కోరినట్లుగా, కరుకుదనాన్ని కోరరు గదా. నాక తెలిసిన ఒక ఆఫీసరు సరిగ్గా ఇదే బ్రాండ్ మనిషి.

ఆయన మాట్లాడితే పోట్టాడుతున్నట్లుంటుంది. వేపాకు కాకరకాయ కలేసి నమిలినట్లుంటుంది. కానీ ఎవరికా అపకారం చేసినట్లు దాఖలాల్లేవు. ఆమాటే సన్నిహితులతో ఆయన గూడా అంటూంటాట్ట.కానీ ఏం లాభం ? ఆఫీసంతా ఆయన శత్రువులే. పొటాషియ సైనేడని లేబులంటించి ఆ సీసాలోగంగా జలం నింపి చేతికిస్తే పుచ్చుకుంటామా ? చస్తే పుచ్చుకోం. కళ్ళకద్దుకుని పక్క వాడికిస్తాం. మనసులో

వెన్నపూసుందో, కుంకుడు రసముందో ఎవడికి తెలుస్తుంది ? నోటిమాట ఆ విషయాలన్నిటిని బయటికి తెస్తుంది. గుండెలనిండా విషం నింపుకునిగూడా బయటికి కోకిలగానంలా మాట్లాడే ప్రబద్ధులున్నారు. మొదట నమ్ముతాం ప్లీజవుతాం – వాళ్ళ చేష్టలు చూసి అభిప్రాయాలు మార్చేసి తిప్పిరాసుకుంటాం. ఆ పైన కోకిల గానాలు, వీణకచేరీలు మన దగ్గర పన్చెయ్యవ్. అంటే మనిషి మంచి చెడ్డల విచారణలో మొదటి టెస్టు నోటిమాట.

ఎన్నికల సీజన్లో మన నాయకులు ప్రతి మీటింగులోను, ప్రతి వోటరు దగ్గరా ఎంతో తియ్యగా , ఆప్యాయంగా మాట్లాడతారు. ' మిమ్మల్ని ' మీ అమ్మాయి పెళ్ళయిందా ' అనో', నాన్నగారి ఆయాసం ఎలా వుందనో, మీ వాడి ఉద్యోగం సంగతి నాకొదిలెయ్యండనో రకరకాల పరామర్శలు చేసి, హామీలు విసిరేస్తారు. అంత మాత్రంచేత ఎంతో తియ్యగా , కమ్మగా మాట్లాడేడని నమ్ముతామా . కల్లో గూడా నమ్మం – కారణం గత చరిత్ర అలాగే, పదేళ్ళుగా కాపురం చేస్తూ పెళ్ళాన్ని పనిమినిషిలాగా చూసే భర్తగారు సడన్‌గా " సుశీ ఇవ్వాళ ఎంత అందంగా ఉన్నావో తెల్సా " అంటే వెంటనే సదరుభార్యగారికి ఏదోప్రళయం ముంచుకొస్తోందని ఇట్టే అర్థమయ్యి " పేకాటకి డబ్బుల్లేవా ? అంటూ సరాసరి విషయంలోకొచ్చేస్తుంది.

అంచేత మాట్లాడే " పద్దతే కాకుండా, మంచి తనాన్ని నిజాయితీని చేతల్లోకూడా చూపిస్తూ ఈ రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ముందుకెడితే అందంగాను, ఆరోగ్యం గానూ వుంటుంది. మాటకి విలువపోతే బతకటం కష్టం. ఇదేకాక మాటకి వృద్ధిపొందే సుగుణంగూడా వుంది. మాటామాటా పెరగటం, మాట తియ్యగా మాటరావటం ఆపైన ఘోరాలు, నేరాలు జరిగిపోవటం మనం చూస్తూనే వుంటా. ఒక్కో సందర్భంలో విన్నమాట సంచలనాన్ని సృష్టిస్తోంది. ' పానీ ఆరే ' అన్నమాట మనలందర్నీ నగరంలో ఎలా కొండలూ, గుట్టలూ ఎక్కించిందో ఇంకా గుర్తుండనే వుంది. ' పలుకే బంగారమా యెనా ' కీర్తన మాటెలావున్నా ' పలుకే కంగారాయెనే ' అన్నట్లయింది. అంచేత ముందునోటిని శుభ్రం చేసుకుంటే ఆపైన వూరంతా పచ్చగా, అందంగా అవుపిస్తుంది.

------- అయ్యిపోయింది -------